పనులు ఇలా..రాకపోకలెలా?

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 17, ప్రభాతవార్తః ఇదేదో లంకల్లో, మరేదైన మారుమూల పల్లెల్లో అనుకుంటున్నారా..! సాక్షాత్తు నగరానికి తలమానికమైన బంజారాహిల్స్‌లోని దేవరకొండ బస్తీలోని ప్రజలు ఎదుర్కొంటున్న దృశ్యాలు.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 5లోని దేవరకొండ బస్తీలో నాలా విస్తరణాభివృద్ధి పనులు ప్రారంభించారు. పనులు కొనసాగు..తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల పిల్లలు, చిన్నారులు ఇళ్ల ముందు ఆడుకొనే పరిస్థితి లేకుండా పోయింది. పాఠశాలలకు వెళ్లే పిల్ల లను ఇలా కాలువపైన తాత్కాలికంగా ఏర్పాటుచేసిన చెక్కలపై నుంచి దాటించడమే కాకుండా ఇంట్లోకి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు కాలువపై ఏర్పాటుచేసుకున్న కర్రల మీది నుంచి దాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మాజీ మంత్రి, ప్రస్తుత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసానికి అత్యంత సమీపంలో ఉండే బస్తీలో ఇలాంటి సమస్య ఉండటం గమనార్హం. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికై నా మేల్కొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువపై ఏర్పాటుచేసిన కర్రలపై పాఠశాల విద్యార్థినిని చేతుల్లో ఎత్తుకొని దాటిస్తున్న దృశ్యం

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

అవాగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు డిజిజి స్వాతి లక్రా, నృత్య ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థులు

మీ క్షేమమే మా లక్ష్యం

- రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- మద్యపానం, అతివేగమే ప్రాణాలు తీస్తోంది
- అందరికీ అవగాహన కోసం యవత నడుంబిగించాలి
- అదనపు డిజిపి స్వాతి లక్రా పిలుపు
- రోడ్డు ప్రమాదాలకు గత ఏడాది లక్షన్నర మంది బలయ్యారు
- కలెక్టర్ దీపక్ తివారీ ఆందోళన

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర అదనపు డిజిపి స్వాతి లక్రా పిలుపునిచ్చారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శ్రీసాయి దంత వైద్య కళాశాలలో నిర్వహించిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ, రాష్ట్రంలో మద్యపానం సేవించి అతివేగంగా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని అన్నారు. యువత సామాజిక బాధ్యతగా సోషల్ మీడియా ద్వారా రోడ్డు భద్రతపై అందరికీ అవగా హన కల్పించాలని సూచించారు.

గమ్యం కంటే ప్రాణం ముఖ్యం

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, ప్రయాణాల్లో గమ్యం కంటే ప్రాణం ముఖ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల వల్ల సుమారు లక్షన్నర మంది ప్రాణాలు కోల్పోయారని, కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రతి నెలా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని తెలిపారు.

కంటి చూపు బాగుంటేనే సురక్షిత ప్రయాణం

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, వాహనం నడిపే వారికి స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యవసరమని పేర్కొన్నారు. డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అద్దాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాకక్షిలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల నిర్మూలన, అత్యవసర సమయంలో సిపిఆర్ చేయడంపై లారీ, ఆటో డ్రైవర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో బస్తీమే సవాల్

యాచారంలో రోడ్డుపై భైటాయించి దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

మేడిపల్లిలో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత దృశ్యం

ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

- కాంగ్రెస్ -బిఆర్ఎస్ మధ్య రణరంగం
- పోలీసులు భారీ బందోబస్తు
- ఆందోళనకారుల అరెస్ట్
- అరెస్ట్‌కు నిరసనగా యాచారంలో నిరసన
- ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం

రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో పై టెన్షన్ నెలకొంది. తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య సవాళ్ల పర్వం తీవ్రస్థాయికి చేరింది. శుక్రవారం చర్చకురావాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డికి మంచిరెడ్డి కిషన్ రెడ్డి సవాల్ విసరగా.. మేడిపల్లిలో చర్చల కోసం బిఆర్ఎస్ నేతలు టెంట్లు కూడా ఏర్పాటుచేశారు. సభ కోసం ఏర్పాటు చేసిన టెంట్లను తొలగించిన పోలీసులతో బిఆర్ఎస్ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. మరోవైపు కాంగ్రెస్ శ్రేణులు కూడా గ్రామంలోకి భారీగా తరలిరావడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

యాచారం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామం రాజకీయ రణరంగంగా మారింది. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విసిరిన బస్తీమే సవాల్ సవాలుతో కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మంచిరెడ్డి కిషన్ రెడ్డి సవాలు మేరకు శుక్రవారం భారీ ఎత్తున కార్యకర్తలతో మేడిపల్లికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రశాంత్‌రెడ్డి తన అనుచరులతో సవాల్ చేస్తుండగా, పోలీసులు రంగప్రవేశం చేసి కార్యకర్తలను చెల్లాచెదురు చేశారు. అరెస్టయిన ఇరు వర్గాల నాయకులను మాడుగుల, కడ్తాల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులకు నిరసనగా యాచారంలో స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించి, దిష్టిబొమ్మను దహనం చేశారు.

పేదల అస్థిత్వంపై దెబ్బ కొట్టారు : కాంగ్రెస్

యాచారం మండల కేంద్రంలోని డీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు రాచర్ల వెంకటేశ్వర్లు, మస్కు నరసింహ, ముత్యాల వెంకట్ రెడ్డి బిఆర్ఎస్ తీరును తూర్పారబట్టారు. ప్రశాంతంగా ఉన్న మేడిపల్లి గ్రామంలో బిఆర్ఎస్ నేతలు రాజకీయ చదరంగం ఆడుతూ చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ఫార్మా భూసేకరణలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రైతుల నుంచి లక్షల రూపాయలకు భూములు తీసుకుని, ఫార్మా కంపెనీలకు కోట్ల రూపాయలకు విక్రయించారని దుయ్యబట్టారు. భూముల విషయంలో పేద ప్రజల అస్థిత్వాన్ని నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సతు వెంకట రమణారెడ్డి, రమేష్ గౌడ్, మోటే శ్రీశైలం, సంగెం రాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని గ్రామంలో నిప్పు పెట్టారు

కాంగ్రెస్ నేతల ధ్వజం

మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు



బోనస్ తుస్సేనా!

- రెండేళ్లు దాటినా అందని బకాయిలు
- మేడ్చల్ జిల్లాలో రూ. 1.62 కోట్ల సన్నవడ్ల బోనస్ పెండింగ్
- ప్రజావాణిలో మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం
- ఆవేదనలో 866 మంది రైతులు
- బడ్జెట్‌లో పెండింగ్ సాకులు..
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17 ప్రభాత వార్త: మేడ్చల్ జిల్లాలో సన్నవడ్ల బోనస్ చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్యం చేస్తోందని జిల్లా రైతు సంఘం నాయకులు, బాధిత రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్ల క్రితం (2024-25) యాసంగి పంటకు సంబంధించి క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లను విక్రయించినప్పటికీ, ఇప్పటివరకు జిల్లాలోని 866 మంది రైతులకు సంబంధించిన సుమారు రూ. 1.62 కోట్ల బకాయిలు అందలేదు. ఈ సమస్యపై రైతులు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలోనూ, రాష్ట్ర స్థాయి ప్రజాభవన్‌లోనూ పలుమార్లు వినతి పత్రాలు సమర్పించారు. జిల్లా రైతు సమాఖ్య సంఘం అధ్యక్షులు ముద్దం సంజీవరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి వ్యవసాయ, సివిల్ సప్లై శాఖల అధికారులను కలిసినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాతి పంటలకు బోనస్ చెల్లించిన ప్రభుత్వం, మొదటి విడత సన్నవడ్ల నిధులను మాత్రం బడ్జెట్‌లో పెండింగ్ అని చూపిస్తూ కాలయాపన చేస్తోందని రైతులు మండిపడుతున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతోందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఇర్రి రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సన్నవడ్ల బోనస్ బకాయిలు చెల్లించాలని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన జిల్లా రైతు సమాఖ్య నేతలు

ఉద్యోగులపై వివక్ష వీడండి

సమస్యలు పరిష్కరించాలని భారీ నిరసన- స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 29నెలలు గడిచి నా ఇంత వరకు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటం లేదని, చొరవ చూపటంలో నిర్లక్ష్యం చేస్తుందని మేడ్చల్ జిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, టిఎన్‌జిఓస్ జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్, మేడ్చల్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు జి.వినోద్ ఆందో ళన వ్యక్తం చేశారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్ట రేట్ వద్ద ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమ యంలో ఉద్యోగులు నల్లబ్యాజ్లీలు ధరించి మహా నిరసన ప్రదర్శనను నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల, టీచర్స్ జెఏసి కమిటీ చైర్మన్, టిఎన్‌జిఓస్ జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు జి.వినోద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రధర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 29నెలలు పూర్తి అయిన ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవటం అన్యాయమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిరంతరం చిన్నచూపు చూస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయటంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని, ప్రభుత్వంపై ఉద్యోగుల నమ్మకం పూర్తిగ దెబ్బతిన్నట్లు తెలిపారు. ఇక మే నెల నుంచి ఎలాంటి ఉపేక్ష ఉండదని, ఉద్యోగుల హక్కుల సాధనకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని వారు స్పష్టం చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యోగుల పోరాటాలు కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను, 52శాతం ఫిట్మెంట్‌తో పిఆర్సీ అమలు చేయాలని, హెల్త్ స్కీమ్‌ను వెంటనే ప్రారంభించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ తరువాత జిల్లా రెవెన్యూ అధికారి,జిల్లా లా ఆఫీసర్ చంద్రావతికి వినతిపత్రాన్ని వారు అందజేశారు.

మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్

సదరం సర్టిఫికెట్లు అర్హులందరికీ అందాలి

అదనపు కలెక్టర్ ఉమా శంకరప్రసాద్ ఆదేశం

వికారాబాద్, ప్రభాతవార్త : సదరం సర్టిఫికెట్‌కు అర్హులైన వారందరికీ మంజూరు అయ్యేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సదరం క్యాంపుల నిర్వహణ, యుడిఐడి పోర్ట్‌లో అప్లోడ్ పై డిపిఎం, ఏపిఎంలతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సదరం సర్టిఫికెట్ కొరకు చేసుకున్న దరఖాస్తులన్నీ యూడిఐడి పోర్టులో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. సదరం క్యాంపుకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ తక్కువ మంది క్యాంపులకు హాజరవుతున్నారనే విషయాన్ని అదనపు కలెక్టర్ గుర్తించారు. సదరం సర్టిఫికెట్ కొరకు స్లాట్ బుక్ చేసిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా సమాచారాన్ని ఇచ్చి క్యాంపులకు హాజరు అయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన సూచించారు. డిఆర్డిఏ ద్వారా చేపట్టే వివిధ కార్యక్రమాల గురించి ఆయన ఆరా తీశారు. సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ శ్రీనివాస్, డిప్యూటీ డిఆర్డిఏ నర్సింలు, డిపిఎం మహేష్, ఏపిఎంలు పాల్గొన్నారు.

ఆలయ భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

హనుమాన్ ఆలయ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వికారాబాద్ ఎంపీడీఓ వినయ్‌కుమార్‌కు చింతలబొడుగ గ్రామస్తులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నారాయణపూర్ గ్రామ పంచాయితీ అనుబంధ గ్రామమైన చింతలబొడుగ గ్రామ కంఠం సర్వే నెంబరు 82 లోని 12 గుంటల భూమిని హనుమాన్ దేవాలయ నిర్మాణం కోసం దానం ఇచ్చారని, ఇప్పుడు వచ్చి తమ భూమి అంటూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇట్టి విషయమై గ్రామానికి వచ్చి తగు వివరణ చేసి, దేవుని భూమి కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీడీఓ ను కలిసిన వారిలో గ్రామస్తులు ఊరడి గోపాల్, వంషీ, ప్రశాంత్, సాయిలు, డి. శంకర్,శ్రీనివాస్, నారాయణ,మల్లయ్య తదితరులు ఉన్నారు.

చిరువ్యాపారులకు నేనున్నా

ఫుట్‌కేసర్‌లో ఓ చిరు వ్యాపారికి గొడుగు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

నోటీసులిచ్చినా ఆగని అక్రమం

- సాగునీటి కాలువపై జోరుగా ఫామ్ ల్యాండ్ పనులు
- మీనమేషాలు లెక్కపెడుతున్న ఇరిగేషన్ శాఖ
- రాజాపూర్‌లో రియల్టర్ల బరితెగింపు
- రిజిస్ట్రేషన్లు ఆపాలని తహసిల్దార్‌కు పంచాయతీ రాజ్ శాఖ లేఖ

ధారూర్ మండలం రాజాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఆస్తుల కబ్జా వ్యవహారం ఇప్పుడు స్థానికంగా పెద్ద సంచలనంగా మారింది. సాగునీటి కాలువలను సైతం లెక్కచేయకుండా, రియల్టర్లు బరితెగించి అక్రమంగా ఫామ్ ల్యాండ్ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగునీటి కాలువలను పూడ్చివేసి, వాటిపై పైపులు వేసి వెంచర్లు నిర్మిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు అక్రమార్కులకు నోటీసులు జారీ చేసి, పనులు ఆపాలని హెచ్చరించినా రియల్టర్లు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు.

ధారూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ధారూర్ మండలం రాజాపూర్ గ్రామంలో సాగునీటి కాలువలను ఆక్రమించి అక్రమంగా ఫామ్ ల్యాండ్ వెంచర్లు ఏర్పాటు చేస్తున్న ఉదంతం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై 'వార్త' పత్రికల్లో కథనాలు రావడంతో ఎట్టకేలకు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు నేరుగా అక్రమార్కులకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు ఆపాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా పరిస్థితి మారలేదు.

రిజిస్ట్రేషన్లు ఆపాలని లేఖ

సాగునీటి కాలువలను పూడ్చివేసి, నిబంధనలకు విరుద్ధంగా పైపు లు వేసిన వ్యవహారంపై పంచాయతీ రాజ్ శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ అక్రమ ఫామ్ ల్యాండ్ వెంచర్‌కు సంబంధించి ఎలాంటి భూ విక్రయాలు జరగకుండా రిజిస్ట్రేషన్లను నిలిపి వేయాలని కోరుతూ మెమో 2461/పి ఎల్ జి/2020 ప్రకారం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఈ నెల 16న పంచా యతీ కార్యదర్శి, 17న మండల అధికారులు విడివిడిగా తహసి ల్దార్‌కు అధికారికంగా లేఖలు అందజేశారు. అనుమతులు లేని ఈ ఫామ్ ల్యాండ్ రిజిస్ట్రేషన్లను వెంటనే నిలిపివేయాలని వారు ఆ లేఖలో స్పష్టం చేశారు.

ఇరిగేషన్ తీరుతో పరేషాన్ : మరోవైపు, సాగునీటి కాలువ ఆక్రమణపై ఇరిగేషన్ అధికారులు హుటాహుటిన పర్యటించి కాలువలో వేసిన పైపులను పరిశీలించారు. అయితే, పరిశీలన జరి పి వెళ్లిన తర్వాత ఇప్పటివరకు ఎలాంటి తదుపరి చర్యలు తీసు కోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువ ఉనికిని దెబ్బతీస్తున్నా అధికారులు మౌనం వహించడం వెనుక అసలు మర్మమేమిటని స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు. కళ్లముందే కాలువలు కబ్జా అవుతున్నా, పంచాయతీ రాజ్ శాఖ నోటీసులు ఇచ్చినా పనులు ఆగకపోవడం పలు అనుమానాలకు తావుతీస్తోంది.

రియల్టర్ల బరితెగింపుపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే స్పందించి అనుమతి లేని ఫామ్ ల్యాండ్, వెంచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు ఆపలేం : తహసీల్దార్

ఈ విషయంపై తహసీల్దార్ సాజిదా బేగం వివరణ కోరగా.. రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని పంచాయతీరాజ్ శాఖ నుండి లేఖ అందిందని చెప్పారు. అయితే, ప్రస్తుత నిబంధనల దృష్ట్యా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయడం తమ పరిధిలో లేదని పేర్కొన్నారు.

ఫామ్ ల్యాండ్ వెంచర్ బోర్డుకు నోటీసులు అంటిస్తున్న పంచాయతీ కార్యదర్శి

సాగునీటి కాలువలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన పైపులు

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న బి.గోపాలం, రాములు

షూటింగ్ బాల్‌లో నిహారిక ప్రతిభ
జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం

పెద్దేముల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో ఎం. నిహారిక బ్రాంజ్ మెడల్ సాధించడం హర్షణీయమని రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ బి. గోపాలం అన్నారు. పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామానికి చెందిన ఎం. నర్సిములు, ఎం. మంజుల కుమార్తె నిహారిక, గొట్లపల్లి మాడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతూ, ఇటీవల తిరుపతిలో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో తెలంగాణ జట్టు తరఫున ఆడి బ్రాంజ్ మెడల్ సాధించింది. శుక్రవారం తాండూరు పట్టణంలో బి. గోపాలం, జిల్లా షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి రాములు ఆమెకు మెరిట్ సర్టిఫికేట్, మెడల్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి, పీఈటీ ప్రశాంత్ రెడ్డి నిహారికను అభినందించారు. తన కుమార్తె విజయం పట్ల తండ్రి నర్సిములు ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

రైతు అంత్యక్రియలకు పిఏసిఎస్ చేయూత

కుల్కచర్ల, ఏప్రిల్, 17 ప్రభాతవార్త: వ్యవసాయ కుటుంబాలకు పిఏసిఎస్ అండగా నిలుసుందని పిఏసిఎస్ డైరెక్టర్ కొండయ్య గౌడ్ అన్నారు. మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామానికి చెందిన రంగి వెంకటయ్య అనే రైతు మృతి చెందాడు. రంగి వెంకటయ్యకు ప్రాథమిక సహకార సంఘం బ్యాంకులో సభ్యత్వం ఉన్నందున రంగి వెంకటయ్యకు అంత్యక్రియల నిమిత్తం రూ. 9వేలు కొండయ్య గౌడ్ స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాథమిక సహకార సంఘం బ్యాంకులో సభ్యత్వం ఉన్న ప్రతి రైతుకు అండగా నిలుస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్న రాములు, కృష్ణయ్య, శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, మహిపాల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కుల్కచర్ల, ఏప్రిల్, 17, ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని నిరసన చేపట్టి తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ 2వ పిఆర్సిని, ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 13 వేల పైచిలుకు ఉన్న ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఏకమొత్తంలో ఒకేసారి విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రి బ్యూటరి పెన్షన్ స్కిమ్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కిమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముందుంచిన 63 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై వివక్ష వీడండి
(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే మాత్రం ఉద్యమాన్ని దశల వారీగ ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జెఏసి అడిషనల్ సెక్రటరీ జనరల్ రామేశ్వర్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు. సెంట్రల్ ట్రెజరర్స్ సహదేవ్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ జయసింహరెడ్డి, సెక్రటరీలు ధానయ్య, రాజు, ఆనంద్‌రెడ్డి, విఠ్ఠల్, మధన్‌రెడ్డి, కన్వీనర్ సుధాకర్, కోకన్వీనర్ రామకృష్ణరెడ్డి, టిఎన్‌జిఓస్ జిల్లా కార్యదర్శి భరత్‌కుమార్, కోశాధికారి శేషసాయి గిరికాంత్, జేమ్స్‌దాస్, కలెక్టరేట్ అధ్యక్షులు కార్తీక్, వివిధ సంఘాల నాయకులు తిరుమలేశ్‌గౌడ్, యు.కుమార్, ఎస్.సత్యం, అక్షయ్‌కుమార్, బి.రవిప్రకాశ్‌గౌడ్, యాదగిరి, వినయ్, అశ్విని, సుధీర్‌కుమార్, శ్రీనివాస్, నజీమా, సత్యజ్యోతి, రవియాదవ్, వెంకట్‌రెడ్డి, చంద్రకుమార్, ఉమాకాంత్, కిషోర్,కిరణ్, హర్ష, రాజ్‌కుమార్, లక్ష్మిప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో నిరసన..

కేశంపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న వివక్షను నిరసిస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు కేశంపేట మండల కేంద్రంలో శుక్రవారం భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మిక సంఘాలు ఏకమై శాంతియుత ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మండల డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా టీజీజేఏసీ మండల చైర్మన్ కరుణాకర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్షా పూరిత వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసనలో టీజీజేఏసీ కన్వీనర్ ప్రకాష్, కోకన్వీనర్ జ్యోతితో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు శివాజీబస్తీలో హిందూ సమ్మేళనం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ పట్టణంలో ఈనెల 19న తేదీన హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు శివాజీ బస్తీ హిందూ సమ్మేళన సమితి తెలిపింది. ఘట్‌కేసర్‌లోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 7:30 గంటల వరకు హిందూ సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. హిందూ సమ్మేళన సమితి శివాజీ బస్తీ నిర్వహకులు మద్దోజు సిద్దిరాజు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి దేవి ఉపాసకులు, సీనియర్ జర్నలిస్ట్ మల్లాది వెంకట గోపాలకృష్ణశర్మ, ఎబివిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-కూకట్‌పల్లి విభాగ్ ప్రముఖ్ డాక్టర్ ఎన్.జానారెడ్డి, డిగ్రీ కళాశాల తెలుగుబాషా ఉపన్యాసకురాలు బండారు పుష్పలతలు విచ్చేసి ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మోక్షం

సొంత భవన నిర్మాణానికి భూమి కేటాయింపు
నిర్మాణ వ్యయం అంతా నేనే భరిస్తా : పూర్వపు ఉపాధ్యాయుడి ఔదార్యం

దాత సుధాకర్ రెడ్డి

తలకొండపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరదించుతూ తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల సొంత భవన నిర్మాణానికి కీలక అడుగు పడింది. మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 291లో 2.37 ఎకరాల ప్రభుత్వ భూమిని కళాశాల కోసం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన భూమి ప్రొసీడింగ్ పత్రాలను గురువారం తహశీల్దార్ రమేష్ కుమార్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావుకు అందజేశారు.

ఎమ్మెల్యే సహకారంతో భూసేకరణ పూర్తి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు. చివరకు 2.37 ఎకరాల భూమిని కళాశాల నిర్మాణానికి ఖరారు చేశారు.

పూర్వపు ఉపాధ్యాయుడి దాతృత్వం

ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ చైర్మన్, పూర్వపు ఉపాధ్యాయుడు అయిన ఎర్ర సుధాకర్ రెడ్డి కళాశాల భవనాన్ని పూర్తిస్థాయిలో తన సొంత ఖర్చుతో నిర్మించడానికి ముందుకు వచ్చారు.

కార్పొరేట్ స్థాయిలో నిర్మించి ఇస్తా

అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తే కార్పొరేట్ స్థాయిలో భవన నిర్మాణం చేపడతానని సుధాకర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, పుస్తకాలు, యూనిఫామ్స్‌ను ఫౌండేషన్ తరపున అందజేశారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

ఒకప్పుడు మూతపడే స్థితికి చేరుకున్న ఈ కళాశాలలో, ఇన్చార్జి షణ్ముఖ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ప్రచార ఫలితంగా 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 150కి చేరింది. హైదరాబాద్‌కు కేవలం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, తలకొండపల్లిలో జూనియర్ కళాశాల లేక విద్యార్థులు దశాబ్దాలుగా ఇబ్బందులు పడ్డారు.

గత ప్రభుత్వం కళాశాల మంజూరు చేసినా, సరైన భవనం లేక ప్రస్తుతం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. తాజా భూమి కేటాయింపుతో విద్యార్థుల కల నెరవేరబోతోంది.

తాను ఉపాధ్యాయుడిగా పనిచేయడంతో పేద విద్యార్థుల విద్యా అవసరాలపై అవగాహన ఉందని, తన వంతు సహాయం చేయాలనే లక్ష్యంతోనే ఈ భవన నిర్మాణ బాధ్యత తీసుకున్నానని ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి వివరించారు.

చిరువ్యాపారులకు సన్‌స్ట్రోక్

ఎండతీవ్రతకు జనం విలవిల
40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత నమోదు

హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: నగరంలో బానుడు భగభగతో నగర వాసులు మండిపోతున్నారు. ఉదయం 9గంటలనుంచే ఎండలు దంచికొడుతుంటే భయటికి రావాలంటే జంకుతున్నారు. గత రెండు రోజుల నుంచి చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిగాలులూ సిటీ శివారు లోని సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ ఏరి యాల్లో ఎక్కువగా ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఎప్పుడూ రద్దీగా కనిపించే సిటీ రోడ్లు మధ్యాహ్నం బోసిపోయి కనిపిస్తున్నాయి. వచ్చే అయిదు రోజులు ఇదే విధంగా ఎండలు దంచికొడతాయని, హీట్ వేవ్స్ ప్రభావం కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతా వరణ శాఖ తెలిపింది. వీలైనంత వరకు ప్రజలు మధ్యాహ్నం ఎండలో తిరగొద్దని, ఇండ్లలోనే ఉం డాలని కోరింది. తగినంత నీరు తీసుకోవాలని, క్యాప్ పెట్టుకోవాలని సూచించింది. వేసవికాలం లో ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తు న్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో బయటకు వెళ్లడం ప్రమాదకరమని చెబుతున్నారు. ఈ సమ యంలో సన్‌స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చెమట రాకపో వడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సన్‌స్ట్రోక్ బ్రెయి న్‌పై ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో నిర్లక్ష్యం చేయొద్దని చెబుతున్నారు. చిన్నారులు వడదెబ్బకు గురైతే జ్వరం, దద్దుర్లు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. డీహై డ్రేషన్ వల్ల గంటల తరబడి మూత్రం రాకపో వడం, శ్వాసలో ఇబ్బంది వంటి సమస్యలు ఉత్ప న్నమవుతాయి. కాబట్టి చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలుపుతున్నారు.

పెద్దల పైనా ఎండ ప్రభావం :

ఎండ తీవ్రత పెద్దలపై కూడా ప్రమాదకరంగానే ఉంటుంది. ముఖ్యంగా కూలీలు, నిర్మాణ కార్మి కులు మిట్టమధ్యాహ్నం ఎండలో పని చేస్తుం టారు. దీని వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వృద్ధులు, మధుమేహం, రక్తపోటు వం టి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

వడదెబ్బ లక్షణాల్లో అధిక చెమటలు, నీరసం, తలనొప్పి, వాంతులు కనిపిస్తాయి. డీహైడ్రేషన్ అధికమైతే చెమటలు కూడా ఆగిపో తాయి. తీవ్రమైన పరిస్థి తుల్లో అపస్మారక స్థితి కూడా రావచ్చు. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయ కుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవ సరమని వైద్యులు పేర్కొంటున్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ఘట్‌కేసర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు మీద చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. 320 ఎఫ్ రీజియన్ గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా సహకారంతో ఇద్దరికి ఎండలో ఉండి పనిచేసుకునే వారికి గొడుగులను అందజేశారు. ఘట్‌కేసర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేగేటు దగ్గర చెప్పులు కుట్టే మోచి బాలయ్య, రోడ్డు పక్కన ఎండలో గాజుల విక్రయ బండి నిర్వహిస్తున్న జ్యోతి అనే మహిళకు లయన్స్‌క్లబ్ గొడుగులను అందించారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షులు రేసు లక్ష్మారెడ్డి, సభ్యత్వనమోదు అధ్యక్షులు బచ్చు నగేశ్‌కుమార్‌గుప్తా, సగ్గు వేణుమాధవ్, మారం లక్ష్మారెడ్డి, ఉడుత హిమబిందు నవీన్, బోగా శ్రీలక్ష్మి హరినాథ్, సార మురళీగౌడ్, మమతాశర్మ, గోరకంటి రవీందర్, రాజు, బోగా హరినాథ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నుండే లక్ష్యాలను ఎంచుకోవాలి : ఎంఈఓ

అత్తాపూర్ ఏప్రిల్ 17,ప్రభాతవార్త : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పాఠశాల నుండి తమ లక్ష్యాలను ఎంచుకోవాలని ఎంఈఓ శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం శివరాంపల్లి ఎంపిపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్ రాథోడ్ ,కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీను నాయక్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గురువుల అంకితభావాన్ని

కొనియాడుతూ, పాఠశాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల 5వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ, వారి భవిష్యత్తు విజయవంతం కావాలని ఆశీర్వదించారు. చిన్నారుల కోసం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆనందోత్సాహాలతో నిండాయి. అనంతరం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పాంప్లెట్‌ను శంకర్ రాథోడ్ ఆవిష్కరించారు. పాఠశాలలో అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పాదరక్షలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలను ఈ పాంప్లెట్‌లో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాలిని, ఉపాధ్యాయులు అనిత ,ప్రభావతి, కృష్ణవేణి, దీప్తి, తేజ ,అనిల్, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వ ఆసరా : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

అత్తాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : దివ్యాంగులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్కూటీలు, అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు రాజేంద్రనగర్ మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్కూటీలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు భరోసా కల్పిస్తూ త్రీ వీలర్ స్కూటీలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరిచేందుకు మరియు డిజిటల్ రిపోర్టింగ్ కోసం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త మొబైల్ ఫోన్లను అందజేయడం జరిగిందని పేదలు, దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, లబ్ధిదారులు ఈ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, స్థానిక పార్టీ నేతలు ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెర

శాస్త్రిపురం ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
-రూ.71కోట్లతో ఆర్ఓబి నిర్మాణం ..

అత్తాపూర్ ఏప్రిల్ 17,ప్రభాతవార్త : నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమైన చోట్ల ఫ్లైఓవర్‌ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపెట వేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. శాస్త్రీపురంలో 71 కోట్ల రూపాయలతో నిర్మించిన ఆర్ఓబిని జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిలతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. శాస్త్రీపురం 4 లైన్ లలో ఫ్లైఓవర్‌ను జిహెచ్ఎంసి నిర్మించింది. జిహెచ్ఎంసి ,సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఎన్నో ఎళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్ అందుబాటు లోకి రావడంతో మైలార్ దేవ్ పల్లి, ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం కానుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎన్నో ఎళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణలను పూర్తి చేయడంతో పాటు మరిన్ని నూతన ఫ్లైఓవర్‌లను నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామని నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ ఎక్కువ అవ్వుతుండడంతో ఫ్లైఓవర్‌ల నిర్మాణలతో ట్రాఫిక్ అంతరా యం లేకుండా చూడొచ్చని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడం వల్ల శాస్త్రీపురం-ఫలక్ నుమా మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ట్రాఫిక్ కష్టాలు శాశ్వతంగా తొలగిపోతాయని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తుందని నిర్ణీత సమయంలోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసినం దుకు అధికారులను అభినందించారు. ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించిన ప్రభుత్వానికి మరియు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ప్రక్రియ, చికిత్స అందిస్తున్న తీరును అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ సజ్జనర్

మాదకద్రవ్యాల రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సికింద్రాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరాన్ని మాదకద్రవ్యాల రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్పష్టం తెలిపారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలోని డీఅడిక్షన్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇటీవల టాస్క్ ఫోర్స్ పోలీసు లు నిర్వహించిన డ్రగ్ టెస్టుల్లో పాజిటివ్ వచ్చిన రౌడీ షీటర్లతో నేరుగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని, వ్యసనం నుండి బయటపడటానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడికి వచ్చిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, బాధితులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాల ని సూచించారు. అనంతరం వైద్యులతో సమావేశమై, కౌన్సెలింగ్ ప్రక్రియ, చికిత్స అందిస్తున్న తీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచామని, ఇందులో భాగంగా 239 మంది రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహించగా, 188 మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని తెలిపారు.

ప్రస్తుతం 35 మంది గాంధీ డీఅడిక్షన్ కేంద్రంలో చికి త్స పొందుతుండగా, మిగతా వారికి ఇతర కేంద్రాల్లో కౌన్సెలింగ్ ఇప్పిస్తు న్నామని తెలిపారు. వారం కిందట ప్రారంభమైన ఈ 15 రోజుల ప్రత్యేక కౌన్సెలింగ్ ప్రక్రియ, చికిత్స ద్వారా వారిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నామ న్నారు. నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్లు అందుబాటులో ఉంచామని వివరించారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులకు, ముఖ్యంగా యువతకు కచ్చితంగా డ్రగ్ టెస్టులు నిర్వహిం చాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించామని వెల్లడించారు. ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రతిపాదనలతో రాష్ట్రవ్యాప్తంగా 35 డీఅడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు కావడం దేశానికే ఆదర్శమని ఆయన కొనియాడారు. ఇది తెలంగాణ ప్రభుత్వ చారిత్రక నిర్ణయమని, దేశంలో ఎక్కడ కూడా ఇంత పెద్ద ఎత్తున 35 చోట్ల డీ అడిక్షన్ కేంద్రాలు లేవన్నారు. ఈ కేంద్రాల వల్ల ఎంతో మంది డ్రగ్స్ వ్యసనపరులకు విముక్తి కలుగుతుందని చెప్పారు.

ఒకవైపు బాధితులను వ్యసనం నుండి విముక్తులను చేస్తూనే, మరోవైపు డ్రగ్స్ విక్రేతలపై ఉక్కుపాదం మోపుతామని, నిందితులపై హిస్టరీ షీట్లు తెరిచి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ ఇదే కేసుల్లో దొరికితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. నగరంలో డ్రగ్స్ నియంత్రణకు హెచ్‌న్యూ విభాగం అద్భుతమైన పనితీరు కనబరుస్తోంద న్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పోలీసులతో సహకరించాలని పిలుపునిచ్చారు. గాంధీ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ ఎన్. వాణి నేతృత్వంలోని వైద్య బృందం, పోలీస్ విభాగం సమన్వయంతో పనిచేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎన్. వాణి , సైకియా ట్రీ హెచ్ఓడీ డాక్టర్ సురేష్, ఆర్ఎంవోలు డాక్టర్ శేషాద్రి, డాక్టర్ యుగేందర్, డాక్టర్ సరిత, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ రజిని పాల్గొన్నారు. పోలీస్ విభా గం నుండి సికింద్రాబాద్ డీసీపీ శ్రీమతి రక్షిత కృష్ణామూర్తి, టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అదనపు డీసీపీ అందే శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో డ్రగ్స్ కలకలం
-ఇద్దరు నిందితుల అరెస్ట్

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

నగరంలోని కొండాపూర్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. ఎక్సైజ్,ఎస్‌టీఎఫ్ బీ టీం నిర్వహించిన ఆపరేషన్‌లో ఇద్దరు నిందితులను ఎక్సై జ్ పోలీసులు అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 6.09 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. కొండాపూర్ ఎక్సైజ్ సీఐ భిక్షరెడ్డి, ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో మాధవహిల్ స్టేట్ ప్రాంతంలో నిందితులను పట్టుకు న్నారు. కాగా నిందితులను విచారించగా డ్రగ్స్‌ను విజయవాడ నుంచి హైదరా బాద్‌కు రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మురళి అనే వ్యక్తిని ప్రధాన సరఫరాదారుగా అధికారులు గుర్తించారు. కాగా మురళి అనే వ్యక్తి వికాస్, భరత్ చౌదరి అనే నిందితులకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ముగ్గురిపై కేసులు నమోదు చేవారు. ఇంటీరియల్ డిజైన్ వ్యాపారం ముసుగులో ఈ ముఠా అక్రమ దందా సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లగ్జరి కార్లలో తిరుగుతూ నగరంలోని అవసరమైన వారికి క్షణాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. గ్రాముకు సుమారు 5వేల దరకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. అరెస్ట్‌చేసిన నిందితులను కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి దర్యాప్తు ముమ్మరం చేశారు.

తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిపియుఎస్ నాయకులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పెద్దేముల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిపియుఎస్ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం టీజీఈ జేఏసి పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో పెద్దేముల్ మండల కేంద్రంలో స్థానిక తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బస్వరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనందం, తహసిల్దార్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ప్రసాద్, తపస్ మండల కార్యదర్శులు విజయలక్ష్మి, స్వరూపరాణి, వడిచర్ల సత్యం, రాజేష్, రాజు, మహేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పిఆర్టియు నాయకులు

పెండింగ్ డిఎలను విడుదల చేయాలి

పెద్దేముల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: పెండింగ్ బిల్లులతో పాటు పెండింగ్ డిఏలను విడుదల చేయాలని మండల పిఆర్టియు అధ్యక్షుడు పోల నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. టిజిఈజేఏసి పిలుపు మేరకు ఉద్యోగుల డిమాండ్ల సాధనకై శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలో స్థానిక తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యంపిఓ రతన్సింగ్, పిఆర్టియు కార్యదర్శి బక్క వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సొంత నిధులతో బోరు

జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: జిల్లేడు చౌదరి గూడ మండలంలోని పద్మారం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి సొంత నిధులతో బోరు వేయించారు. గ్రామంలో నీటి సమస్య ఉందని సర్పంచ్ మోహనాచారి ఎమ్మెల్సీకి తెలిపిన వెంటనే స్పందించి గ్రామంలో బోరు వేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్తులు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎదిర రామకృష్ణ, బోడంపాటి రవీందర్ రెడ్డి, మాజీ మండల సర్పంచ్ సంఘం అధ్యక్షులు మీది గడ్డ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సిఐ సైదులుకు వినతిపత్రం సమర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జవహర్‌నగర్ కేసులను మల్కాజిగిరి కోర్టుకు మార్చాలి

జవహర్‌నగర్, ఏప్రిల్ 17. ప్రభాతవార్త : జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదయ్యే క్రిమినల్ కేసులను మేడ్చల్ కోర్టు బదులు సమీపంలోని మల్కాజిగిరి జిల్లా కోర్టుకు మార్చాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ, న్యాయవాది దుర్గం సాయినాథ్ గౌడ్ కోరారు. ఈ మేరకు జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులుకు వినతిపత్రం సమర్పించారు. జవహర్ నగర్ ప్రాంతం కాప్రా మండల పరిధిలోకి వస్తుండగా, సివిల్, ఫ్యామిలీ కేసులు మల్కాజిగిరిలోనే పరిష్కారం అవుతున్నాయని, కానీ క్రిమినల్ కేసులను 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడ్చల్ కోర్టుకు కేటాయించడం వల్ల సాక్షులు, ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మేడ్చల్ కోర్టుకు వెళ్లేందుకు ప్రత్యక్ష బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఆలస్యాలు జరిగి వారెంట్లు జారీ కావడం, కేసులు డిస్మిస్ కావడం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్కాజిగిరి కోర్టుకు ఈ పోలీస్ స్టేషన్ పరిధిని మార్చాలని విజ్ఞప్తి చేశారు.



ప్రాణాపాయస్థితిలో ప్రాథమిక చికిత్సపై శిక్షణ

జవహర్ నగర్, ఏప్రిల్ 17. ప్రభాతవార్త : జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా పోలీసులు ప్రాణరక్షణకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండెపోటు, శ్వాస ఆగిపోయిన పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం ఎలా అందించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంట (గోల్డెన్ అవర్)లో స్పందించడం ఎంతో కీలకమని అధికారులు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం కోసం సమాచారం ఇవ్వడం, ప్రాథమిక చికిత్స అందించడం వంటి అంశాలను నిపుణులు ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ చక్రపాణి, సీఐ సైదులు, ట్రాఫిక్ సీఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:

ప్రజల త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే సెక్రటేరియేట్‌ను ముట్టడిస్తామని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన సనత్ నగర్ పరిధిలోని సుభాష్ నగర్, కైలాష్ నగర్, సీ టైప్ క్వార్ట ర్స్, డీఎస్ఎం కాలనీలలో అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు.

తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న టిజిఇ జెఎసి నాయకులు

పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

దౌల్తాబాద్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇ జెఎసి)పిలుపు మేరకు శుక్రవారం దౌల్తాబాద్ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సంధర్భంగా టిజిఇ జెఎసి నాయకులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మాట్లాడుతూ..2026 జూన్ 2వ తేదీ నాటికి కొత్త పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న 5 డిఎలను వెంటనే విడుదల చేయాలని,సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి,పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,రిటైర్డ్,సర్వీసింగ్ ఉద్యోగులందరికీ తక్షణమే హెల్త్ కార్డ్స్ జారీ చేయాలని అన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని,జనాభా లెక్కల కార్యక్రమంలోపే సాధారణ బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించి ఈ న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని,లేని యెడల కార్యాచరణను మరింత ఉధృతం చేస్తామని వారు ఈ సంధర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు నగేష్,ప్రధాన కార్యదర్శి బసప్ప,టిపియుఎస్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాస్,పలువురు ఉద్యోగ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పిఆర్సీని ప్రకటించాలి

కాప్రా, ఏప్రిల్ 17.ప్రభాత వార్త: మేడ్చల్ మల్కాజ్గిరి కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో.రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టి జి ఆర్ ఎస్ ఏ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి కాశిరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్‌కు తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా కాశిరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించా లని కోరారు. వచ్చే జూన్ రెండు నాటికి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పిఆర్సి ని ప్రకటిం చాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్ల కోసం ప్రకటించిన హెల్త్ స్కీంను వెంటనే అమలు చేసి, హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. సాధారణ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌కు బదులుగా ఓ పి ఎస్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను వెంటనే చెల్లించాలని అన్నారు.ఇంకా 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్వర్ణలత, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, చక్రధర్, జి పి ఓలు సురేష్, స్వామి, సంతోష్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జిలతో నిరసన

చేవెళ్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణ కోరారు. శుక్రవారం చేవెళ్ల ఆర్డిఓ పార్ధ సింహారెడ్డికి టిజిఇజెఏసి, టిఆర్ఇఎస్ఎ రాష్ట్ర కమిటి పిలుపు మెరకు తహసీల్దార్, ఆర్డిఓ కార్యాలయ సిబ్బంది పిఆర్సిని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డిఏ బిల్లులను మంజూరు చేయాలని చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణ అద్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్బంగా చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఎలా అని ప్రశ్నించారు.ప్రభుత్వానికి వ్యతిరెకంగా నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్లు రాజేందర్, రాజశేఖర్,రాకేష్, డివిజనల్ సర్వేయర్ రత్నాకర్, కార్యలయ సిబ్బంది మహేందర్,దుర్గేష్,గందం క్రిష్ణా,అంజనేయులు,బుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ళ ఆర్డిఓ పార్ధసింహా రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణ

పాత పెన్షన్ విధానాన్ని(ఏపీఎస్) పునరుద్దరించాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

కొడంగల్,ఏప్రిల్ 17ప్రభాతవార్త: తెలంగాణా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు తెలంగాణా సంయుక్త యాక్షన్ కమిటీ(టీజీఈజేఏసీ)అద్వర్యంలో శుక్రవారం స్దానిక తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా టీజీఈజేఏసీ కన్వీనర్ అబ్దుల్‌హక్,జనరల్ సెక్రటరీ అశోక్,ప్రెసిడెంట్ విష్ణుకుమార్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పెండింగ్‌లో ఉండటం వల్ల వేలాది కుటుంబాలు ఆర్దిక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.తమ డిమాండ్‌లలో ప్రధానంగా 2వ పీఆర్సీ అమలు,జూన్ 2,2026లోపు 2వ పీఆర్సీ నివేదికను తెప్పించుకొని 51శాతం ఫిట్‌మెంటుతో పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ,డీఆర్‌లలో కలిపి అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.బకాయి బిల్లుల చెల్లింపు,పెన్షనర్లకు సంభందించిన సుమారు రూ.13,000కోట్ల బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు.అలాగే ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులు,నగదు రహిత వైద్యం కోసం నూతన విధి విధానాలు రూపొందించి కొత్త హెల్త్ కార్డులను జారీ చేసి మే 1నుండి పథకాన్ని పూర్తి స్దాయిలో అమలు చేయాలన్నారు.ఏపీఎస్ పునరుద్దరణ,సీపీఎస్(సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని(ఏపీఎస్) పునరుద్దరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ వికారాబాద్ జిల్లా కోకన్వీనర్ ఎస్టీయూటీఎస్ జిల్లా అద్యక్షులు వేణుగోపాల్,టీఎస్‌జీఆర్ఈఏ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ,పీఆర్టీయూటీఎస్ మండల ప్రధాన కార్యదర్శి దినేష్‌సింగ్‌లతో పాటు పీఆర్టీయూటీఎస్ జిల్లా,రాష్ట్ర నాయకులు ఆనంద్‌రావు,గోపినాథ్, వెంకటేశం, నర్సింహులు,రజిత,వెంకటయ్య,లచ్చిరెడ్డి,వొడ్నాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.కాగా తెలంగాణా సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్,ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్‌ల అధ్వర్యంలో వేర్వేరుగా తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ,ఉద్యోగ జెఎసి సంఘాల నాయకులు

కేశంపేటలో టిజిజెఎసి ఆధ్వర్యంలో నిరసన

కేశంపేట,ఏప్రిల్ 17, ప్రభాతవార్త : తెలంగాణ ఎంప్లాయిస్ జెంట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులపై కొనసాగుతున్న వివక్షతా విధానాలను ఖండిస్తూ, తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ ఆందోళన చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. అనంతరం తమ సమస్యలను వివరించే వినతిపత్రాన్ని మండల డిప్యూటీ తహసిల్దార్‌కు సమర్పించారు.ఈ కార్యక్రమంలో టీజీజేఏసీ కేశంపేట మండల చైర్మన్ కరుణాకర్ గౌడ్, కన్వీనర్ ప్రకాష్, కోకన్వీనర్ జ్యోతి తదితరులతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కరుణాకర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వం వివక్షతను విడిచిపెట్టి సమానత్వంతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో మరింత తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



డిప్యూటీ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కీసర,ఏప్రిల్17,ప్రభాతవార్త: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఘట్‌కేసర్ డిప్యూటి కమీషనర్ వాణిరెడ్డి అన్నారు.మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని అరవిందనగర్ కాలనీ,దాయరకుంట ప్రాంతాలలో శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ నాగారం వార్డులో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మల్కా జిగిరి మున్సిపల్ కార్పోరేషన్ ఏంటమాలజీ విభాగం దోమల నివారణ చర్యలను మరింత వేగవంతం చేసిందన్నారు.ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా దోమ గుడ్డు నుండి లార్వా దశ వరకు మరియు పెద్ద దోమగా ఎలా మారుతుందో మొబైల్ వీడియోలు,ఫ్లిప్ బుక్స్ ద్వారా ప్రత్యక్షంగా వివరించారు.ఏంటమాలజీ సిబ్బంది ఇంటింటికి తిరిగి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగిస్తూ ప్రజలకు తగిన సూచనలు చేశారు.ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులు,డ్రమ్ములు,కూలర్లు,పాత టైర్లు,పూల కుండీలు,కొబ్బరి బోండాలు,నిరుపయోగ వస్తువులలో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే కాలనీలు,బస్తీలు,గేటెడ్ కమ్యూనిటీలలో కాలనీ సంక్షేమ సంఘాలు, మహిళా సంఘాలు,ఎంఎంసి అధికారుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం జరుగుతోందని అన్నారు.దోమల నివారణ ప్రతి పౌరుని బాధ్యత దోమల రహిత నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ వారినికి ఒకసారి తమ ఇళ్లలో పరాసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమలం డిఈఈ ఎస్‌డబ్ల్యూఎం శ్రీనివాస్,ఏఈ చంద్ర శేఖర్,ఎస్ఎస్ఈఎస్‌డబ్ల్యూఈఎస్ (ఏంటమాలజీ),శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

"ఫ్రైడే డ్రైడే" కార్యక్రమంలో పాల్గొన్న ఘట్‌కేసర్ డిప్యూటి కమీషనర్ వాణిరెడ్డి

చేవెళ్ల మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారిపై అండర్ పాసులు ఏర్పాటు చేయాలి

చేవెళ్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: చేవెళ్ల మండలం మీదుగా నిర్మిస్తున్న హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై అవసరమైన ప్రాంతంలో అండర్ పాసులు ఏర్పాటు చేయాలని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య విన్నవించారు. శుక్రవారం డీల్లీలో చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య కలిసి వినతి పత్రం సమర్పించారు.చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ జాతీయ రహధారిపై అండర్‌పాస్‌లు లేకపోవడం మూలంగా చేవెళ్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.రైతులు పొలాలలకు వెల్లాలంటే కూడ రోడ్డు మార్గం తప్పని సరిగా ఉండాలన్నారు. ముఖ్యంగా మల్కాపూర్, మిర్జాగుడ, ఇంద్రారెడ్డి నగర్, అలూరు వద్ద అండర్ పాస్‌లను ఏర్పాటు చేస్తూ, అవసరమైన ప్రాంతంలో కూడ అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టితో చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్,వైస్ చైర్మన్ రాములు,ముడిమ్యాల సహకార సంఘం మాజీ చైర్మన్ ప్రతా ప్‌రెడ్డి,చేవెళ్ల సహకారం సంఘం మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి,సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్,ప్రభాకర్‌రెడ్డి, సినియర్ కాంగ్రేస్ నాయకులు జనార్దన్‌రెడ్డి,మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి,సర్దార్ నగర్ మార్కెట్ కమిటి చైర్మన్ సురేందర్‌రెడ్డి,పామెన కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ మంగళి యాదగిరి తదితరులు పాల్గోన్నారు.

హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై అండర్ పాసులు ఏర్పాటు చేయాలని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి విపతి పత్రం సమర్పించిన చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య

ప్రపంచ హిమోఫిలియా దినోత్సవ ర్యాలీ

కొడంగల్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త: ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రప్రియ అద్వర్యంలో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వ ప్రజా ప్రగతి పాలనలో భాగంగా సమాజంలో ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.రోగ నిర్దారణ శ్రద్ద వహించడానికి మొదటి అడుగు అని ప్రతి పౌరుడు గుర్తించడానికి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగ నిర్దారణ పరీక్షలు చేయించు కోవాలన్నారు.అంతేగాక అన్ని రకాల పరీక్షలు చేయించుకొని ఆసుపత్రిలో విధిగా డాక్టర్లను సంప్రదించి చికిత్సలు చేయించుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని అన్నారు.ఆరోగ్యమే మహా భాగ్యం అనే సూత్రాన్ని పాటించి విధిగా తమవంతు ప్రయత్నం చేసి తెలియని వారికి అవగాహన కల్పించాలన్నారు.బ్లీడింగ్ అవుతున్న సమయంలో ముఖ్యంగా ఇది పాటించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాకేత్,మైమునా అఫ్జల్,నర్సింగ్ సిబ్బంది,నర్సింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు విద్యార్దులు కార్యాలయ సిబ్బంది,కనిష్ట సహాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు,నర్సింగ్ విద్యార్దులు

ప్రభుత్వానిదే అని రుజువు చేస్తే భూమిని వదిలేస్తా

మీడియాతో మాట్లాడుతున్న నేతలు

తాండూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : మా సొంత భూమిపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, భూమి ప్రభుత్వానిదని రుజువు చేస్తే రూపాయి లేకుండా భూమిని వదిలేస్తామని తాండూరు మైనార్టీ నేత అబ్దుల్ అహద్ అన్నారు. తాండూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సర్వే నెంబర్ 130లో సుమారు 36 గుంటల ప్రభుత్వ భూమి కాంగ్రెస్ నాయకులు అమీర్ అబ్దుల్లా ఆక్రమణకు పాల్పడుతున్నారని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం అమీర్ అబ్దుల్లా తండ్రి, ముస్లిం వెల్ఫేర్ నాయకులు అబ్దుల్ అహద్ మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేసిన ఆరోపణలను ఖండించారు. సర్వే నెంబర్ 130లోని 36 గుంటల భూమి ప్రభుత్వానిది కాదని, పట్టా భూమి అని అన్నారు. ఆ భూమిని 1983లోనే రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. అప్పట్లో పన్నులు కూడా వసూలు చేశారని, భూమికి హద్దులు కూడా నిర్ణయించారని చూపించారు. 36గుంటలలో చేపడుతున్న నిర్మాణాలపై మున్సిపల్ అనుమతులకు దరఖాస్తులు కూడా చేసుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, ప్రభుత్వ భూమి అని రుజువు చేస్తే భూమిని వదిలేసి వెళ్లిపోతామని అన్నారు.

మసీదులు,దర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

కడా ప్రత్యేక అధికారికి మైనార్టీల వినతి

కొడంగల్,ఏప్రిల్ 17ప్రభాతవార్త:కొడంగల్ నియోజకవర్గంలో మసీదులు,దర్గాల అభివృద్దికి రూ.125కోట్ల నిధులు మంజూరీ చేయాలని మైనార్టీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ ఎస్.ఎం.గౌసన్ కోరారు.ఈ మేరకు శుక్రవారం కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో మత సామరస్యాన్ని సంక్షేమాన్ని కాపాడుతున్నందున సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.కొడంగల్ నియోజకవర్గంలో అనేక చారిత్రాత్మక మసీదులు,దర్గాలు ఉన్నాయని,ఇవి రాష్ట్ర సాంస్కృతిక వరసత్వంలో భాగమన్నారు.అయితే ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో మసీదులు,దర్గాలు అభివృద్దికి నోచుకోక మరమ్మత్తులు లేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు.మసీదులు,దర్గాల పునరుద్దరణ,ఆధునీకరణకు ప్రత్యేక నిధులు రూ.125కోట్లు మంజూరీ చేయాలన్నారు.ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని మసీదుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలన్నారు .పెరుగుతున్న జనాభాకనుగుణంగా మసీదుల నిర్మాణానికి స్దలాలు కేటాయించాలని కోరారు.తెలంగాణాలో గంగా జమున,తెహజీబ్‌ను నిలబెడుతూ ముస్లీం మైనార్టీల మతపరమైన స్దలాల అభివృద్దికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కడా ప్రత్యేక అధికారికి అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కడా ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు

శామీర్‌పేట డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

శామీర్‌పేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: శామీర్‌పేట డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను స్థానిక నాయకులతో కలిసి మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు,బిజెపి రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. శుక్రవారం శామీర్‌పేట డివిజన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని కోరుతూ మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్‌ను కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని ఆమె అందజేశారు. అయితే ఇటీవల ఎంపి ఈటల రాజేందర్ దృష్టికి సమస్యలను హైమారెడ్డి తీసుకవెళ్లటంతో ఆయన మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్‌కు పరిష్కరించాలని సూచించటం జరగటంతో ఆ వెంటనే ఆమె జోనల్ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు. త్రాగునీరు, సిసి రోడ్ల, పలు సమస్యలను ఆమె తెలియజేశారు. ఈ సమస్యలను పరిష్కరించటానికి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు ఎన్.హైమారెడ్డి తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రధాన మంత్రి సురక్ష భీమాను ఉచితంగా మహిళా శక్తి మై వాయిస్ సంఘం నుంచి చేయించటం జరుగుతుందని ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం కోశాధికారి అంబటి రమేశ్, గ్రామస్థులు యశోధ, అండాలు, విజయలక్ష్మి, చంద్రశేఖర్, నర్సింగ్, మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన మహిళా శక్తి మైవాయిస్ సంఘం అధ్యక్షురాలు

ఉపాధి కూలీలకు వాటర్ క్యాన్లు పంపిణీ

తలకొండపల్లి ఏప్రిల్ 17 ,ప్రభాతవార్త: తలకొండపల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు శుక్రవారం నాడు గ్రామ సర్పంచ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్ సొంతంగా తాగునీటి కోసం వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం వేసవి కాలం కావడం తో కూలీల దాహార్తిని తీర్చేందుకు సొంతంగా వారికి వాటర్ క్యాన్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య ఉపాధి హామీ కూలీలు తదితరులున్నారు.

అంగన్వాడిలో ఘనంగా పోషన్ పక్వాడ

పాల్గొన్న సర్పంచ్ దివ్య శంకర్ నాయక్

అంగన్వాడి పోషన్ పక్వాడ కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్

కుల్కచర్ల,ఏప్రిల్17, ప్రభాతవార్త : అంగన్వాడి కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దివ్య శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బండమిది తాండ గ్రామపంచాయతీ అనుబంధమైన ఎర్రలచతాండ అంగన్వాడి కేంద్రంలోని పోషక పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్ వైజర్ సంధ్య గర్భిణి స్త్రీలకు బాలింత తల్లులకు చారుధాన్యాలపై అవగాహన కల్పించారు.పోషక ఆహర విలువలు, మహిళలకు చిరుధాన్యాల వల్లఅందే పోషక విలువలను వివరించారు.పోషక విలువలు కలిగే ప్రయోజనాల గురించి క్లుప్తంగా వివరించారు.ప్రతి ఒక్క మహిళ రాగులు,సజ్జలు, కొర్రలు,మొదలగు తృణ ధాన్యాలలో ఐరన్ పిండిపదార్థలు అధికంగా లభిస్తాయని తెలిపారు.చిరుధాన్యాలను తప్పనిసరిగా మహిళలందరూ స్వీకరించి ఆరోగ్యంగాఉండాలని అన్నారు.అమ్మాయిలకు 18 సంత్సరాలు నిండిన తర్వాతే వివాహ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, పంచాయతీ కార్యదర్శి దేవ్‌సింగ్, అంగన్వాడి టిచర్ అంజమ్మ వార్డు సభ్యులు దన్నమ్మ,తదితరులు పాల్గొన్నారు.

డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా జంగం వీరన్న నియామకం

నూతన జిల్లా ప్రధాన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు,కార్యకర్తలు

దౌల్తాబాద్,ఏఫ్రిల్ 17,ప్రభాతవార్త: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజికవర్గం దౌల్తాబాద్ మండలానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు జంగం వీరన్నకు జిల్లా స్థాయిలో కీలక పదవి దక్కింది.ఆయనకు డిసిసి(జిల్లా కాంగ్రెస్ కమిటీ) ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది.జంగం వీరన్నకు రాజకీయాలు కొత్త కాదు.ఈయన కుటుంబం గతంలోనే ప్రజా సేవలో తమదైన ముద్ర వేసింది.ఆయన తండ్రి గతంలో సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించి గ్రామ అభివృద్ధికి పాటు పడగా,ఆయన సతీమణి జడ్పిటిసిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు.ఈ రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వీరన్న,అంచలంచెలుగా ఎదుగుతూ ఈ స్థాయికి చేరుకున్నారు.

నిబద్ధతకు దక్కిన గుర్తింపు:

గతంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా సమర్థవంతంగా పనిచేసిన వీరన్న,పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు శ్రమించారు.గ్రామ స్థాయి నుండి ప్రజలతో మమేకమవుతూ,వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతున్న ఆయన నిబద్ధతను గుర్తించిన అధిష్టానం,ఇప్పుడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలను అప్పగించింది. వీరన్న నియామకం పట్ల దౌల్తాబాద్ మండల ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.గ్రామ స్థాయి నుండి ప్రజల సమస్యలపై పోరాడే వీరన్నకు ఈ పదవి దక్కడం పట్ల ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుం దని,భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పలువురు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఎస్ఐ రమేష్ కుమార్

కుల్కచర్ల,ఏప్రిల్,17 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ రమేష్ కుమార్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధానచౌరస్తాలోరోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఎస్ఐ రమేష్ కుమార్ మాట్లా డుతూ.. రోడ్డు భద్రత నియమాల పై అవగాహన పెంచు కుని ప్రతి ఒక్కరూ నిబం ధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.రహదారి భద్రత అనేది ఒకరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.వేగ పరిమితులకు లోబడి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మధ్యం సేవించి వాహనం నడపరాదని అన్నారు.డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. వాహనాలను అజాగ్రత్తగా నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సిబ్బంది వెంకటేష్, మొగులయ్య, సత్యయ్య,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 17,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండలంలో శుక్రవారం అక్రమంగ తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఓటి పోలీసులు పట్టు కున్నారు. మండలంలోని వేప కుచ్చతాండ నుంచి టీజి07వి4847 నెంబరు గల బులోరో వాహనంలో 56సంచుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పాత్లవత్ సంతోష్, పాత్లవత్ ఆకాశ్‌లు అక్రమంగ రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోవడం వల్లన అక్రమంగ తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



బొలోరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం

ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

మండల టిజిఇజెఏసి నాయకులు

పూడూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని పలువురు మండల టిజిఇజెఏసి నాయకులు డిమాండ్ చేశారు. టిజిఇజెఏసి పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పూడూరు మండల తహశీల్దారు

పూడూరు తహశీల్దారు విజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మండల టిజిఇజెఏసి నాయకులు

విజయ్‌కుమార్‌కు మండల టిజిఇజెఏసి ఉపాధ్యాయుల అద్వర్యం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026జూన్2వతేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి ప్రకటించాలని, 5డిఎలను విడుదల చేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు క్లీయర్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు జారీచేసి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61సంవత్సరాలు నిండిన విఆర్ఏల వారసుల ఉద్యో నియామక సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జనాభా లెక్కల కార్యక్రమం ఉన్నందున ఉద్యోగ ఉపాధ్యాయులకు సాదారణ బదిలీలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపియుఎస్ మండల అధ్యక్షులు నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు సంతోష్, టిపియుఎస్ జిల్లా బాధ్యులు చిన్ని క్రిష్ణ, ఎస్‌జిటియు జిల్లా అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి టిపియుఎస్ మండల బాధ్యులు రాంప్రసాద్, వెంకటమ్మ, మధసూధన్, ప్రవీణ్, ఆనందం, నవీన్, సాయిబాబా, మహేష్, శ్రీనివాస్, సల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల సాధనకై టీజీ ఈ జెఏసి అధ్యక్షులు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న నిరసన ప్రదర్శనలో భాగంగా చేవెళ్ల ఆర్డీవో శంకర్ పల్లి మండలం ఎమ్మార్వో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, ప్రస్తుత ప్రభుత్వం మూడు సంవత్సరాలు కావస్తున్న వాయిదాలు వేస్తూ వస్తున్న న్యాయపరమైనటువంటి విషయాలను వెంటనే నెరవేర్చాలని మండల తపస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా 3 సంవత్సరాలు కావస్తున్న పీఆర్సీ ని తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ 2 లోపు అమలు చేయాలని

ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ నాయకులు

డిమాండ్ చేశారు. ఎస్ జి టి యూనియన్ నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేసి ప్రభుత్వం తమ మాట నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. మండల అధ్యక్షులు శ్రీనివాస్, యూనియన్ ఖాదర్ అలి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులు ఆరోగ్య విషయంలో వెంటనే స్పందించ హెల్త్ కార్డ్స్ అందరికీ ఆమోద్యోగ్యకరమైన రీతి లోఅమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులు సమస్యలు వెంటనే సకాలంలో పరిష్కరించటానికి గాను ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ గౌరవ అధ్యక్షులు హమాలీ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి బసవరాజు ఎస్. జి.టీ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మండల బాధ్యులు శ్రీనివాస్, బాలరాజు, పాండు సార్, జీపీవో యూనియన్ అధ్యక్షులు ఖాదర్ అలీ, ఉపాధ్యాయులు కే శ్రీనివాస్, జంగయ్య, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఫిట్మెంట్, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

కీసర, ఏప్రిల్17, ప్రభాతవార్త: ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్మెంట్‌తో పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం కీసర సర్కిల్ పరిధిలోని కీసర జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక ఫెన్షనర్ల ఉమ్మడి కార్యచరణ కమిటీ ఆద్వర్యంలో జూన్ 2లోపు పిఆర్‌సిని 51 శాతం ఫిట్మెంట్‌తో ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 5 డిఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ ఫెన్షనర్‌లకు


కీసర జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బకాయిపడ్డ సరెండర్, జిపిఎఫ్, డిఏ ఏరియర్, ఫెన్షనర్ల గ్రాడ్యూటీ, కమిటేషన్ బిల్లులను ఏక మొత్తంగా ఒకేసారి 13 వేల కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనతో రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోతే ముమ్ముందు ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యయులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలి

కీసర, ఏప్రిల్17, ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే పరిష్కరించాలని టీజీ ఈ జేఏసి నాయకులు చీర యాదగిరి కోరారు. శుక్రవారం టీజీ ఈ జేఏసి రాష్ట్ర పిలుపు మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ ఉపాధ్యాయ ఫెన్షనర్‌లు బోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి తహశీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి ప్రకటన, హెల్త్ కార్డుల అమలు, పాల ఫెన్షన్ విదానం అమలు లాంటి ప్రధాన డిమాండ్లు జూన్ రెండో తారీఖు లోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శులు సునీల్‌కుమార్, సతీష్‌కుమార్, టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్షులు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ యాదగిరిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద కార్మికుల నిరసన

జెఏసి పిలుపు మేరకు డిపో వద్ద గేట్ మీటింగ్

..ఈ నెల 22నుంచి జరిగే సమ్మెలో పాల్గొనేందుకు సన్నాహాలు

శామీర్‌పేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద కార్మికులు నిరసనలు

తెలియజేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని హకీంపేట్ ఆర్టీసి డిపో వద్ద జెఏసి పిలుపు మేరకు ఈ నెల 22న ఆర్టీసి సమ్మెలోకి వెళ్తున్నందున కార్మికులను సిద్దం చేయటానికి డిపో వద్ద గేట్ మీటింగ్‌పెట్టి నిరసనలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గేట్ మీటింగ్ పెట్టి నిరసనలు తెలిపినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్టీసి జెఏసి కో కన్వీనర్ యాదయ్య, సికింద్రాబాద్ రీజియన్ జెఏసి చైర్మన్ గోపు శ్రీనివాస్, డిపో జెఏసి నాయకులు సలహాదారు బాల్‌రాజ్‌గౌడ్, డిపో చైర్మన్ రాజేందర్, వైస్‌చైర్మన్ సంజీవ, పూల్‌సింగ్, చెవ్వ శ్రీశైలం, సుజిత్, నాగరాజు, రాంచందర్, తులసిరామ్, కిషన్, పుష్పలత, పద్మ, వెంకటేశ, పలువురు ఉద్యోగులు, మహిళా కండక్టర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

తెలంగాణా సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్‌స్వామి

కొడంగల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: హిందు ధర్మ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేద్దామని తెలంగాణా సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్‌స్వామి, హిందు జనశక్తి అధ్యక్షులు లలిత్‌కుమార్, హిందు జాతీయ సాహిత్య పరిసత్ ప్రాంత సంఘటన మంత్రి వక్త భాస్కరయోగి పిలుపునిచ్చారు. శుక్రవారం స్దానిక రెడ్డిబసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన హింధూ సమ్మేళనం కార్యక్రమానికి తెలంగాణా సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్‌స్వామి, హింధూ జనశక్తి అధ్యక్షులు లలిత్‌కుమార్, హింధూ జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత సంఘటన మంత్రి వక్త భాస్కరమోగి, డాక్టర్ రవీంద్రయాదవ్ తదితరులు హజరై మాట్లాడారు. హింధూ ఓ ధర్మమని, అది ఒక మతం కాదని, ఒక జీవన విధానమని అన్నారు. హింధూ సమాజాన్ని చైతన్యం చేస్తు దేశాన్ని విశ్వగురువు స్దానంలో నిలపాలనే లక్ష్యంతో కృషి చేద్దామన్నారు. నేటి సమాజంలో ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు హిందువులు సంఘటితంగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరు హిందు ధర్మాన్ని అచరించాలని, ధర్మాన్ని కాపాడే వారసులుగా ముందుకు వెళ్ళాలన్నారు. అనేక మంది దేశం కోసం త్యాం చేశారని గుర్తు చేస్తు స్వాతంత్ర పోరాటంలో హిందువులను అనేక విధాలుగా చిత్రహింసలకు గురి చేశారన్నారు. 150 సంవత్సరాల క్రితం వందేమాతరం గీతాన్ని రచించి గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. హింధూ సమ్మేళనం 1925లో ప్రారంభమై నేటికి వందేళ్ళు పూర్తి చేసుకోవడంతో మరింతగా ప్రజలను చైతన్య చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. హిందువులు సంఘటితమైతే రానున్న కాలంలో భారత్ విశ్వగురువు స్దానంతో పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో హిందు సంఘాల సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణా సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్‌స్వామి

శ్రీవారి ఆలయ పునఃనిర్మాణ పనుల పరిశీలన

నిర్వాసితుల ఇళ్ళ స్దలాల్లో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న కడా ప్రత్యేక అధికారి

కొడంగల్, ఏప్రిల్ 17 , ప్రభాతవార్త: పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర దేవాలయ పునఃనిర్మాణ పనులను కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్‌లు శుక్రవారం పరిశీలించారు. ముందుగా బాలాలయంలో శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇతర అధికారులతో కలిసి దేవాలయ అభివృద్ది కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే ఆలయ కూల్చివేత పనులు, ఖాళీ స్దలాల పంపిణీ అంశాలను పరిశీలించారు. కాగా శ్రీవారి ఆలయ పునఃనిర్మాణానికి ప్రభుత్వం రూ.110కోట్లు మంజూరీ చేయడంతో ఆలయ పరిసరాల్లో ఉన్న ఇళ్ళలను ఖాళీ చేయిస్తున్నారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెక్కులు అందించడంతో పాటు జాతర స్దలంలో ప్లాట్‌లను మంజూరీ చేశారు. నిర్వసితులకు కేటాయించిన ఇళ్ళ స్దలాల్లో కొనసాగుతున్న రోడ్లు, డ్రైనేజీ తదితర పనులను వారు పరిశీలించారు.

విద్యార్థులు భవిష్యత్తులో అందరికీ ఆదర్శంగా ఉండాలి

కీసర, ఏప్రిల్17, ప్రభాతవార్త: విద్యార్థులు భవిష్యత్తులో ఒకరికి ఆదర్శవంతంగా ఉండాలని కేఆర్‌కే గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ కేఆర్‌కే రెడ్డి అన్నారు. శుక్రవారం కీసర సర్కిల్ పరిధిలోని కళాశాలలో ప్రెషర్ ఫెర్‌వెల్, ఆన్‌వెల్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా, ధృడంగా ఉంటూ మీ సంకల్పాన్ని చేరుకోవాలని కోరారు. నమ్మకంగా, మంచి గుణాన్ని బట్టి పేరు ప్రఖ్యాతలు వస్తాయి కాబట్టి ఆ విదంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాంబారెడ్డి, వైఎస్ఆర్ కాలేజీ ప్రిన్సిపల్ జ్యోతి, డిఎడ్ కాలేజీ ప్రిన్సిపల్ దీపిక, ఇంఛార్జి ఉపాద్యాయురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కేఆర్‌కే కళాశాల చైర్మన్ కేఆర్‌కే రెడ్డిని సన్మానిస్తున్న ఉపాద్యాయులు

కళాశాల ఆవరణలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కీసరలో రియల్ మోసం

కీసర, ఏప్రిల్17, ప్రభాతవార్త:కీసరలో రియల్ మోసం జరిగిన సంఘటనపై కేసు నమోదు జరిగినట్లు సిఐ ఆంజనేయులు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి గ్రామం దయానంద్ నగర్ ఆఫీసర్స్ కాలనీలో ఉన్న ప్లాట్ నెంబర్ 235 (సర్వే నంబర్లు 263,264లలో) 200 గజాల స్దలం ఉందన్నారు. ఈ ఫ్లాట్‌కి అసలైన ఓనర్ గంగాధర వీరయ్య కాగా అతను ఆమే కుమార్తె లీలావతికి గిఫ్ట్ డీడ్ ఇచ్చాడు. కానీ వీరయ్య తన ఒరిజినల్ డాక్యుమెంట్ పొగొట్టుకుని నగరంలోని తుకారంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తరువాత లీలావతి 29.03.2022లో రాంపల్లిదాయర గ్రామానికి చెందిన గంగి మల్లేష్‌కి అమ్మగా ఈ స్దలంపై ఆయన కాంపౌండ్ వాల్ నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నారు. కానీ గంగి మల్లేష్ ఆ ప్లాట్‌కి సంబంధించి బెదిరంపు ఫోన్ కాల్స్ రావడంతో కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ప్రధాన నిందితుడు నాంపల్లి ప్రభాకర్‌రెడ్డి (ఏ 1), వీరయ్య యొక్క ఒరిజినల్ పేపర్‌లు లభించడంతో తన సహచరులతో గుడిబాటి


రియల్ మోసంలో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కి పంపిన పోలీసులు

రమేష్‌రెడ్డి (ఏ3). తుమ్మల మధుకర్‌రెడ్డి (ఏ4) కలిసి అసలు యజమాని గంగాధర వీరయ్యకి బదులు మరో వ్యక్తి (ఏ2) నచ్చు రామస్వామిని అసలైన ఓనర్‌గా చూపించి ఆ ప్లాట్‌ని గుడిబాటి రమేష్‌రెడ్డి (ఏ3) 2004లో నకిలీ రిజిస్ట్రేషన్ చేయించారు . అనంతరం నకిలీ పత్రాల ఆధారంగా పలువురికి భూమిని విక్రయిస్తూ డబ్బులు సంపాదించారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపామని మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని సిఐ తెలిపారు.

ఎంసిపల్లి మండలంలో ఫర్టిలైజర్ షాపులు తనిఖీలు

..మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ

..ఆఫ్‌లైన్‌లో యూరియా విక్రయాలు జరపకుండ చర్యలు

..నానో యూరియాను ప్రమోట్ చేయాలని ఆదేశాలు

శామీర్‌పేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: మూడుచింతలపల్లి మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ పర్యటించి తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలో పలు చోట్ల ఉన్న ఫర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీలు చేసి స్టాక్ బుక్‌లను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ ఫర్టిలైజర్ డీలర్లు ఎవరు కూడ యూరియాను ఆఫ్‌లైన్ విక్రయాలు జరపవద్దని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ యూరియా బుకింగ్ యాప్‌ను ఈ నెల 13నుంచి నిలిపివేయటం జరిగిందన్నారు. ఆఫ్‌లైన్ విక్రయాలు జరగకుండ మండల వ్యవసాయ అధికారులు తరుచూ పర్యటించి డీలర్లకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. అదే విధంగా నానో యూరియాను ప్రమోట్ చేయాలని అధికారులకు, డీలర్లకు సూచించారు.

మూడుచింతలపల్లి మండలంలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి యూరియా విక్రయాలను పరిశీలించిన మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి ప్రవీణ దృశ్యం

ప్రాణరక్షణపై డ్రైవర్లకు అవగాహన

మోమిన్‌పేట్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: మోమిన్‌పేట్ మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీఎస్ మోమిన్‌పేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సీపీఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ సైకిల్ రైడర్లు, ఆటో డ్రైవర్లు, అలాగే భారీ వాహనాల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రైవేటు వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించేందుకు అవసరమైన సీపీఆర్ విధానాన్ని ప్రదర్శించి వివరంగా తెలియజేశారు. గుండె ఆగిపోయిన సందర్భాల్లో తక్షణ స్పందన ఎంత ముఖ్యమో వివరించి, సరైన పద్ధతిలో సీపీఆర్ ఎలా చేయాలో ప్రాక్టికల్ సెషన్‌ల ద్వారా ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స మరియు సమయానికి స్పందనతో అనేక ప్రణాలను కాపాడవచ్చని తెలిపారు. డ్రైవర్లు కేవలం ట్రాఫిక్ నియమాలను పాటించడం మాత్రమే కాకుండా ప్రమాద సమయంలో బాధితులకు సహాయం చేయగలిగే నైపుణ్యాలు కూడా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం పాల్గొన్న ప్రతి డ్రైవరుకు అత్యవసర ఆరోగ్య కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లలో ప్రాథమిక చికిత్సకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచి, ప్రమాదాల సమయంలో తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడేలా చేశారు. ఈ కార్యక్రమం ద్వారా డ్రైవర్లలో ప్రాణ రక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, రోడ్డు ప్రమాదాల ప్రభావాన్ని తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా సాగడంతో పాల్గొన్న వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు బృందం, ప్రాథమిక ఆసుపత్రి బృందం తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్ శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దామరగిద్దలో న్యూట్రిషన్ హెల్త్ క్యాంప్ ప్రారంభం

చేవెళ్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాని 9వ వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు అన్నారు.

శుక్రవారం దామరగిద్ద గ్రామంలో న్యూట్రిషన్ హెల్త్ ఆయుర్వేద క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య పరీక్షలు అందించడమేన్యూట్రిషన్ హెల్త్ క్యాంప్ లక్ష్యమని తెలిపారు. కేవలం రూ.200కే 39 రకాల కంప్యూటర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్ శనివారం కూడా కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాల వెంకటయ్య, దొడ్డి సత్తయ్య, అక్నాపురం నర్సింలు, దొడ్డి మల్లేష్, ఎర్రవల్లి శంకరయ్య, బోద పవన్, బోద ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు

తహసీల్దార్ బైరెడ్డి రాజేశ్ హెచ్చరిక

జవహర్ నగర్, ఏప్రిల్ 17. ప్రభాత వార్త: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు.

కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేశ్ ఆదేశాల మేరకు జవహర్ నగర్ పరిధిలోని సర్వే నంబర్లు 339, 396లో ఉన్న పాపయ్య

నగర్, బీజేఆర్ నగర్, మల్లికార్జున నగర్ ప్రాంతాల్లో పలు అక్రమ నిర్మాణాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బైరెడ్డి రాజేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను రక్షి చేందుకు ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు ఈ కూల్చివేత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇకముందు కూడా ఇలాంటి అక్రమ నిర్మాణాలపై నిరంతర చర్యలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

మేకగూడ లో సిమెంట్ రోడ్లును శుభ్రం చేస్తున్న నాయకులు.

సిమెంట్ రోడ్డును శుభ్రం చేసిన వార్డు సభ్యుడు, నాయకులు

నందిగామ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : నందిగామ మండలం మేకగూడ గ్రామంలో కొత్తగా నిర్మించిన మేక గూడ సిసి రోడ్డును శుక్రవారం 3 వ.వార్డు సభ్యుడు బందారి రాజు ముదిరాజ్ ట్యాంకర్ నీటితో శుభ్రం చేశారు, సిసి రోడ్డు నిర్మాణంలో క్యూరింగ్ కోసం మట్టితో కట్టలు కట్టారు. క్యూరింగ్ అనంతరం మట్టి తీయకుండ వదిలేయడంతో వచ్చి పోయే వాహనాలతో దుమ్ము రావడంతో ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని గమనించిన వార్డు సభ్యుడు బందారు రాజు, మల్లేష్, హనీఫ్ పలుగు పార పట్టి మట్టి తొలగించి సిమెంట్ రోడ్డును ట్యాంకర్ పెట్టి నీళ్లతో శుభ్రం చేశారు.

మల్లారెడ్డిగూడలో మెడికల్ క్యాంపు

షాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ప్రజాపాలనలో భాగంగా మల్లారెడ్డిగూడ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ప్రభుత్వం ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సబిత గోవర్ధన్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ మందుగుల మాణిక్యం, పంచాయతీ సెక్రెటరీ దీపలత, గ్రామస్తులు సత్యనారాయణ, భూపాల్‌రెడ్డి, జట్ట మల్లయ్య, ఒగ్గు నర్సింలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు .

మల్లారెడ్డిగూడలో మెడికల్ క్యాంపు

సిఐటియులో చేరిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

మొయినాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మరియు మొయినాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ యూనియన్ నాయకులు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి సిఐటియు జిల్లా అధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ సమక్షం లో సిఐటియులో చేరారు . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు రుద్ర కుమార్ మాట్లాడుతూ సిఐటియు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని, మొయినాబాద్ మండల పరిధిలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ప్రమాదం జరిగిన వారికి సిఐటియు అండగా ఉంటుందని కార్మికులకు ఏ సమస్య వచ్చినా సిఐటి యు సంఘం దృష్టికి తీసుకురావాలని అదేవిధంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఇన్సూరెన్స్ కార్డు పొందుతే కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక లాభాలు ఉన్నాయని ఏ ప్రమాదం జరిగిన ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్ సిఐటియు కార్మికులకు అందిస్తుందని అందుకే సంక్షేమ బోర్డు కార్డు తీసుకోవాలని పిలుపునిచ్చారు... భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ నాయకులు , మొయినాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బుర్ర శంకర్, ప్రధాన కార్యదర్శి చింతల రవి కోశాధికారి చింతల మోనాకర్ గౌరవాధ్యక్షులు చింతల దర్శన్ రామ్ రెడ్డి బాబు సాగర్ నవీన్ సాగర్ శ్రీధర్ సతీష్ మల్లేష్ ప్రభు సాగర్ లక్ష్మీ మ్నారాయణ యాదయ్య ముత్యాలు అశోక్ నర్సింగ్ రావు చింతల రాజు ఆనంద్ తదితరులు సిఐటియులో చేరారు సిఐటియులో చేరిన యూనియన్ నాయకులు మాట్లాడుతూ మొయినాబాద్ మండల పరిధిలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ఆపద వచ్చిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



సిఐటియులో చేరుతున్న భవన నిర్మాణ కార్మికులు

సిఐ కి ఘన సన్మానం

తలకొండపల్లి ఏప్రిల్ 17 ఖీప్రభాతవార్త: తలకొండపల్లి మండలకేంద్రంలో శుక్రవారం నాడు తలకొండపల్లి సీఐ జానకిరెడ్డినీ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మండలానికి నూతన సిఐగా జానకిరామ్ రెడ్డి రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అతని శాలువాతో సన్మానించారు, ఈ సందర్భంగా సిఐ జానకి రామ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎప్పటికప్పుడు నాయకులు స్పందించాలన్నారు. గ్రామాలలోని యువకులు ఎలాంటి చెడు అలవాట్ల కు లోను కాకుండా చూడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీ మ్దేవి రఘు రాములు, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ, పడకల్ మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, రేణు రెడ్డి తదితరులున్నారు.

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

..మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి

శామీర్‌పేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు పట్ల బిజెపి నాయకులు నిరంతరం అవమానకర వ్యాఖ్యలు చేయటం దారుణమని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం లక్షలాది మంది ప్రజలు చేసిన పోరాటాలు, ప్రాణత్యాగాలు, ఆత్మబలిదానాలను తక్కువ చేసి మాట్లాటం బిజెపి నాయకులకు అలవాటుగ మారిందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా బిజెపి నాయకులు ప్రవర్తిస్తున్నారని అన్నారు. కోట్లాది ప్రజల ఆకాంక్షగ నిలిచిన తెలంగాణ రాష్ట్రాన్ని అవమానించటం ద్వారా ప్రజల భావోద్వేగాలను దెబ్బతీస్తున్నారని ఆయన అన్నారు. తాజాగ బెంగుళూరు ఎంపి తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు మరింత అభ్యంతరకరంగ ఉన్నాయని, తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చటం అత్యంత నీచమైన చర్యగా భావిస్తున్నట్లు, ఈ వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు బి.జైపాల్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాష్ట్ర ఆత్మగౌరవంపై ఎవరైనా దాడి చేస్తే ప్రజలు తగిన సమాధానం ఇస్తారని జైపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

మండుతున్న ఎండలతో ఉక్కిరి బిక్కిరిబిక్కిరౌతున్న ప్రజలు, మూగజీవాలు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 17. ప్రభాతవార్త: ఎక్కడ చూసినా భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమని దంచి కొడుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలనుండే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనాలు ఉక్కుపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల మాచారం మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యప్తంగా 43, డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై జనాలను, మూగజీవాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇట్టి ఉష్ణోగ్రత పలు జిల్లాలలో మరింత పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలలకు ఆరెంజ్ అలర్టు జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో ఆయా జిల్లాలలో 41, నుంచి 44, డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జనాలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.